సాక్షి అనకాపల్లి

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

వైఎస్సార్ ఆసరా పథకం పంపిణీ కార్యక్రమం చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లో జరిగింది. 8లో



హరహర మహాదేవ

కొమ్మాది: రుషికొండ తీరంలో జార్ఖండ్‌కు చెందిన ప్రేమ్ సింగ్ అనే పర్యాటకుడు ఇసుకతో అద్భుతంగా శివలింగాన్ని తీర్చిదిద్దాడు.

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజుల్లో ఒక రోజు చిరుజల్లులు కురుస్తాయని, నాలుగు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజున 2 మి.మీ వర్షపాతం కురుస్తుందని, ఉష్ణోగ్రతలు గరిష్టంగా 30.8 నుంచి 31 డిగ్రీలు నమోదవుతాయని పేర్కొన్నారు.

సీఎం జగన్ పర్యటనకు ఏర్పాట్లు

- 'ఆడుదాం–ఆంధ్రా' ముగింపు వేడుకలకు హాజరు కానున్న ముఖ్యమంత్రి
- వైఎస్సార్ క్రికెట్ స్టేడియంను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న



ఏర్పాట్లపై చర్చిస్తున్న ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న విశాఖలో పర్యటించనున్నారు. పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఆడుదాం–ఆంధ్రా రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం స్టేడియంలోకి రాక, క్రీడాకారులతో ఫొటోలు, ప్రజలతో మమేకం, అభివాదం తదితర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించారు. సీఎం వైఎస్ జగన్ 13వ తేదీ సాయంత్రం స్టేడియానికి చేరుకుని ముందుగా లోపల ఓపెన్ టాప్ వాహనంపై తిరుగుతూ ప్రజలకు అభివాదం చేస్తారని, అనంతరం కామెంటేటర్ రూంకు చేరుకుంటారని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న కలెక్టర్‌కు తెలియజేశారు. తుది ఆట ముగిసిన వెంటనే స్టేడియం లోపల లేజర్ షో ఉంటుందని, అనంతరం సీఎం క్రీడాకారులను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లను రహదారి భవనాల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మల్లికార్జున పలు సూచనలు చేశారు. విద్యుత్, పోలీసు శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, సామాన్య ప్రజానీకం వచ్చి ఆటలను ఆస్వాదించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టేడియంలోకి ఆ రోజు సుమారు 25 వేల మందికి పైగా ప్రజలు వస్తారని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 మణికంఠ, రహదారులు భవనాలు, విద్యుత్, అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా జోష్



క్రీడాకారుల ఉత్సాహం



ఏయూ మైదానంలో వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు



పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి రోజా. చిత్రంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, హరివెంకట కుమారి, కోలా గురువులు, వరుదు కల్యాణి



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



క్రీడాకారులతో మంత్రి రోజా కరచాలనం



కబడ్డీ..కబడ్డీ



కలెక్టర్ మల్లికార్జునతో సెల్ఫీ

- 'ఆడుదాం ఆంధ్రా' తుది దశ పోటీలు ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి రోజా
- క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయం : బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విశాఖ స్పోర్ట్స్:

మహా క్రీడా సంబరంతో విశాఖ మురిసిపోయింది. గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి విశాఖ వేదికైంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా.. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలను విశాఖ రైల్వే స్టేడియంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. 13న ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈసందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ చరిత్రలో మనకంటూ ఒక పేజీ ఉండాలంటే ఇదే చక్కటి సందర్భం అన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తొలుత రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వీసీఎండీ టాలెంట్ హంట్‌లో భాగంగానే ఈ పోటీలు అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ విశాఖ వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం నగరం చేసుకున్న అదృష్టమన్నారు. భారత్ క్రికెట్ జట్టు వికెట్ కీపర్, స్థానికుడు కేఎస్ భరత్ మాట్లాడుతూ కష్టపడితే ఫలితం దక్కుతుందని అన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 26 జిల్లాలకు చెందిన మెన్, వుమెన్ జట్ల చేత అతిథులు క్రీడాప్రతిజ్ఞ చేయించారు. తొలుత రైల్వే స్టేడియంలోని వేదిక వద్ద శాప్ పతాకాన్ని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జాతీయ పతాకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించగా అతిథులు గౌరవవందనం సమర్పించారు. పోటీలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి ప్రకటించి గాల్లోకి బెలూన్లను విడిచారు. అనంతరం అతిథులు క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, ఇతర రాజకీయ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.



హాజరైన జట్ల ఆటగాళ్లు




క్రీడాకారులతో భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్ భరత్

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు ఎనిమిది అర్జీలు

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ కె.వి.మురళీ కృష్ణ నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు ఎనిమిది మంది పోలీసు సిబ్బంది అర్జీలు సమర్పించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు, కానిస్టేబుళ్లు, హెచ్‌సీలు అనారోగ్యం, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆభరణాల కోసం వెండి వితరణ



ఎం.కోడూరు గ్రామ సర్పంచ్ సంజీవరావుకు వెండి అందజేస్తున్న సౌజన్య

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు మోదకొండమ్మ తల్లికి ఆభరణాలు తయారు చేయించేందుకు విశాఖ సుజాత నగర్‌కు చెందిన దామర్ల సౌజన్య, రవికాంత్ దంపతులు అరకిలో వెండి అందజేశారు. త్రిశూలం, విల్లు, శంఖును తయారు చేసి అమ్మవారికి అలంకరిస్తామని సర్పంచ్ సంజీవరావు తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన వెటరన్ క్రీడాకారుడు



చోడవరం : జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చోడవరం వెటరన్ క్రీడాకారుడు పోటు రమణమూర్తి సత్తా చాటారు. ఈనెల 8వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరుగుతున్న 5వ జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చోడవరానికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పోటు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచి పతకం సాధించారు. ఇప్పటికే అనేక మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన ఆయన తాజాగా జరిగిన పోటీల్లో కూడా సత్తా చాటడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

ఏఆర్ పోలీసులు ఎన్నికలకు సిద్ధం కావాలి

ఆరిలోవ : ఈ ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు సిద్ధంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ జరుగుతున్న పరేడ్‌ను పరిశీలించి, సిబ్బంది నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి విధుల్లో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. డబ్బు, మద్యం, ఉచిత కానుకలు తరలింపును అరికట్టాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన డీఎస్పీ పి.నాగేశ్వరరావుకు ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రామకృష్ణారావు, వెంకటరావు, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కైలాసగిరిలో ఏఆర్ పోలీసుల పరేడ్ పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లింపు

- పనులు అడ్డుకోవడం తగదు
- ఆర్‌డీవో, ఏపీఐఐసీ జెడ్ఎం

నక్కపల్లి: విశాఖ– చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా నక్కపల్లి మండలంలో సేకరించిన భూములకు సంబంధించిన పరిహారాన్ని పూర్తిగా చెల్లించినట్టు ఆర్డీవో జయరాం, ఎస్‌డీసీ సత్యవాణి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్‌లు తెలిపారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ చందనాడ, వేంపాడు, డీఎల్ పురం, రాజయ్యపేట గ్రామాల పరిధిలో రైతులనుంచి సేకరించిన 4,318 ఎకరాల జిరాయితీ, డీఫారం భూములు ఏపీఐఐసీ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. ఈ భూముల్లో 1,120 ఎకరాలను స్టార్టప్ ఏరియాగా గుర్తించినట్టు చెప్పారు. ఈ భూముల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి పనులు ప్రారంభించినట్టు చెప్పారు. అయితే కొంతమంది రాజకీయ పార్టీల వారు రైతులను తప్పుదోవ పట్టించి పనులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. రైతులకు నష్టపరిహారం పెండింగ్‌లో ఉందంటూ పనులు అడ్డుకుంటున్నారని తెలిపారు. రైతుల నుంచి సేకరించిన భూములకు ఆరోజు విడుదల చేసిన నోటిఫికేషన్, చట్ట ప్రకారం నిర్ణయించి నష్టపరిహారాన్ని పూర్తిగా చెల్లించినట్టు చెప్పారు. కేవలం 20 మంది రైతులకు సంబంధించి 38 ఎకరాలకు మాత్రమే పరిహారం పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానిది తప్పు లేదని వారు చెప్పారు. వివాదాస్పద భూములు, రైతుల్లో అవగాహన లేక, ఎక్కువ పరిహారం వస్తుందని కొంతమంది ఆశచూపడంతో వారంతా భూములు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడం తదితర కారణాల వల్ల పరిహారం చెల్లించలేదన్నారు. ఆందోళన చేస్తున్న రైతుల్లో ఎవరైనా పరిహారం అందలేదని, వారి వద్ద ఉన్న ఆధారాలతో వస్తే వెంటనే పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ నీరజ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏపీఐఐసీ అధికారులు

హంస వాహనంపై సింహగిరీశుడు

- దేవేరులతో వేణుగోపాలుడిగా దర్శనం
- వరాహ పుష్కరిణిలో నౌకా విహారం
- కనులపండువగా తెప్పోత్సవం



వేణుగోపాలస్వామి అలంకారంలో అప్పన్న





నేత్రపర్వంగా తెప్పోత్సవం (ఇన్‌సెట్) పాల్గొన్న భక్తులు

సింహాచలం : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేణుగోపాలస్వామిగా ఈఉత్సవంలో దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి అంతా కిటకిటలాడింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకి తీసుకొచ్చారు. కొండదిగువ తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు మెంబర్లు, అధికారులు, అడవివరం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామిని ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. శోభానమానీయంగా అలంకరించిన హంసాకృతి నౌకపై స్వామిని వేంజేంపచేశారు. సాయంత్రం సుమారు 6 గంటల నుంచి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వరాహ పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం చుట్టూ మూడుసార్లు హంసవాహనాన్ని ప్రదక్షిణగా తిప్పారు. అనంతరం మండపంలో స్వామిని వేంజేంపచేసి విష్వక్సేణపూజ, పుణ్యాహావాచనం, షోడషోపచార పూజలు, విశేష ఆరాధనలు, పారాయణాలు నిర్వహించారు. తదుపరి స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి సర్వజన మనోరంజని వాహనంపై వేంజేంపచేసి గ్రామ తిరువీధిని విశేషంగా నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి అడవివరం గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, వేద పండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. స్వామివారు విహరించిన హంసవాహనాన్ని విశేషంగా తీర్చిదిద్దారు. వరాహ పుష్కరిణి వద్ద పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని విశేషంగా అలంకరించారు. పుష్కరిణి గట్టుపై ఏర్పాటు చేసిన సాంస్కృతికార్యక్రమాలు, కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

యూపీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం

అనకాపల్లి: స్థానిక 84వ వార్డు పరిధిలో కోట్నివీధి యూపీహెచ్‌సీని కేంద్ర క్యాలిటీ కంట్రోల్ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. కేరళ రాష్ట్రానికి చెందిన డీఎంహెచ్‌వో పి.ఎస్.విద్యాధరన్, నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన నోడల్ అధికారి డాక్టర్ నజియాషాహిన్‌లు యూపీహెచ్‌సీలో వివిధ విభాగాలను, రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, తల్లీపిల్లలకు అందుతున్న సేవలు, ఆస్పత్రిలో పరిశుభ్రత, మందులు, ప్రభుత్వం వైద్య సిబ్బందికి ఇచ్చిన శిక్షణ, రికార్డులు ఇతర అంశాలను పరిశీలించారు. శనివారం కూడా ఆస్పత్రిలో వివిధ విభాగాలను తనిఖీ చేయనున్నారు. అనంతరం బృందం సభ్యులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి నాగేంద్ర, క్యాలిటీ కంట్రోల్ జిల్లా అధికారి ఎం.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ రోగుల రికార్డులను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న నాగాలాండ్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నజియాషాహిన్

పరిశుభ్రతతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

తుమ్మపాల : పిల్లలందరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనం చేసే ముందు చేతులు సబ్బుతో శుభ్రపరచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.హేమంత్ అన్నారు. పట్టణంలో గవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి పిల్లలందరు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చేతి గోళ్లు కత్తిరించుకోవాలన్నారు. కాయకూరలు, పండ్లు శుభ్రమైన నీటితో శుభ్రపరచుకుని తినాలన్నారు. పిల్లలందరు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ లూసీకార్డీలియా, డాక్టర్ జయదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో

యాభై వసంతాల నాటి చెలిమి..

- చిగురులు తొడిగిన అ'పూర్వ' సమ్మేళనం
- ఆత్మీయ ఆలింగనం చేసుకున్న పాతమిత్రులు

8లో

క్లుప్తంగా

రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లు మంజూరు

నాతవరం: ఈ ఏడాది జిల్లాలో 1200 హెక్టార్లలో బిందు తుంపర్ల సేద్యం విస్తరించేందుకు ప్రభుత్వం లక్ష్యం విధించిందని జిల్లా సూక్ష్మ సాగునీటి వనరుల ప్రాజెక్టు డైరెక్టరు జి.వి.లక్ష్మి అన్నారు. మర్రిపాలెం పంచాయతీలో శుక్రవారం ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఆశాజ్యోతిలో కలిసి పామాయిల్ తోటలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంతవరకు 770 హెక్టార్లలో రైతులకు రాయితీపై ఏర్పాటు చేశామన్నారు. బిందు తుంపర్ల సేద్యం యూనిట్ల మంజూరుకు ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం యూనిట్లు మంజూరు చేస్తామన్నారు.

నేడు పాయకరావుపేటలో మహా సంకల్ప సభ

కె.కోటపాడు : పాయకరావుపేటలో శనివారం నిర్వహించనున్న మహా సంకల్ప సభను దళితులంతా విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు కోరారు. కె.కోటపాడులో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వెయ్యి మంది జనాభా కలిగిన ప్రతి దళితవాడను పంచాయతీగా ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో మన వాడలు మనమే బాగు చేసుకోగలమని ఆయన తెలిపారు. ఇటువంటి అంశాలను మహాసంకల్ప సభలో ప్రస్తావించనున్నట్టు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో దళితులు కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


చోడవరం మండలంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు


సభకు హాజరైన వేలాది మంది మహిళలు

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- డ్వాక్రా మహిళలకు రూ.14.73 కోట్లు ఆసరా చెక్కు అందజేత
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

చోడవరం : మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చిన ఆసరా పథకంలో 4వ విడతగా రూ.14.73 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు ధర్మశ్రీ శుక్రవారం అందజేశారు. ఇక్కడ శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేలాది మంది డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. ప్రధానంగా మహిళల సాధికారత, సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు దశలవారీగా రుణమాఫీ చేస్తుండగా మరో పక్క సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చి ఆ వడ్డీని ప్రభుత్వమే భరించే విధంగా సహకారం అందిస్తున్నారన్నారు. సున్నా వడ్డీతోపాటు ఆసరా పథకంలో మంజూరైన డబ్బులు నేరుగా డ్వాక్రా సంఘాల ఖాతాల్లో జమచేసి మహిళలకు అండగా ముఖ్యమంత్రి నిలిచారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు రుణమాఫీ చేస్తానని, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాలను విడిపిస్తానని చెప్పి మహిళలను మోసం చేశాడని ధర్మశ్రీ విమర్శించారు. అంతేకాకుండా ఎన్నికల ముందు పసుపు కుంకుం పేరుతో మహిళలను చంద్రబాబు మభ్యపెట్టాల ని చూసినప్పటికీ ఆయనకు బుద్ధి చెప్పి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడంలో మహిళలు పూర్తి సహకారం అందించారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా పథకాలన్నీ పార్టీలకు అతీతంగా ప్రజల ఇంటి ముందుకే తెచ్చి అందిస్తుందన్నారు. ఇది ప్రచారాల ప్రభుత్వం కాదని, ఇది ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే అన్నారు. మహిళలకు మరింత మేలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రత్నప్రభ, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ , ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మహిళా విభాగం అధ్యక్షురాలు యర్రా దేవి, పట్టణ మాజీ అధ్యక్షురాలు అల్లాడ భవానీ, ఈటీపీఆర్‌డి చైతన్య, వెలుగు ఏపీఎం కనకరాజు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


దిబ్బిడిలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందిస్తున్న విప్ ధర్మశ్రీ

మాయగాడు చంద్రబాబు..

బుచ్చెయ్యపేట : డ్వాక్రా రుణాలు బ్యాంకులకు కట్టొద్దని మహిళల్ని మోసగించిన మాయగాడు చంద్రబాబునాయుడైతే ఆసరా నగదు అందించి ఆదుకున్న మొనగాడుగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం దిబ్బిడి గ్రామంలో బుచ్చెయ్యపేట మండలానికి మంజూరైన నాల్గో విడత ఆసరా నగదు రూ, 7.60 కోట్లు నగదు చెక్కును మహిళలకు ఆయన అందించారు. 2014లో చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలెవరూ బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు, బంగారు రుణాలు తిరిగి కట్టొద్దని, అధికారంలోకి వస్తే రూ.13,800 కోట్లు మహిళల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గద్దె నెక్కిన తరవాత చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మహిళలను మోసగించాడన్నారు. ప్రజా సంకల్పయాత్రలో జగనన్న హామీ ఇచ్చిన నవరత్నాల పథకంలో భాగంగా మహిళల బ్యాంకు రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసి ఆదుకున్నాడన్నారు. చంద్రబాబు అప్పట్లో ఉన్న అప్పు రూ.13,800 కోట్లు కట్టకపోవడంతో వడ్డీతో జగనన్న రూ, 25,532 కోట్లు బ్యాంకులకు కట్టి అక్కచెల్లెమ్మలను ఆదుకున్నారన్నారు. మాట మీద నిలబడే జగనన్నకే మహిళంతా పట్టం కట్టాలని, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని అన్నారు. చోడవరం నియోజకవర్గంలో రూ.168 కోట్లు డ్వాక్రా రుణాలను మాఫీ చేసి ఆసరా ద్వారా నాలుగు విడతలుగా అందించడమే కాక నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తనని ఎమ్మెల్యేగా గెలిపించాలని విప్ ధర్మశ్రీ కోరారు. కార్యక్రమంలో చోడవరం వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జోగా కొండబాబు, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు గొంపా చినబాబు, దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఏపీఎం బాలరాజు, వెలుగు సిబ్బంది కొండలరావు, గణపతి పాల్గొన్నారు.

పొత్తు లేకుండా పోటీ చేసే దమ్ము చంద్రబాబుకు లేదు

- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి


నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

నక్కపల్లి : ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబునాయుడు ఢిల్లీలో తాకట్టు పెట్టారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కొయ్య ప్రసాదరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ పొత్తు లేనిదే ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము చంద్రబాబునాయుడికి లేదన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపిస్తే ఆయనకు వెన్నుపోటు పొడిచి పార్టీ లాక్కున్న చంద్రబాబు తర్వాత పొత్తు లేకుండా ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయడంలో విఫలమైన బీజేపీతో చంద్రబాబు పొత్తుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. మళ్లీ 2024లో బీజేపీతో పొత్తు కోసం అమిత్‌షా, మోదీతో కాళ్ల బేరానికి దిగుతున్నారన్నారు. విభజన చట్టాలను అమలు చేయని బీజేపీతో పవన్ పొత్తు ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం పవన్ నోరు మెదపడం లేదన్నారు. వైఎస్సార్ హయాంలో చక్కెర కర్మాగారాలకు నిధులు మంజూరు చేసి నష్టాల ఊబిలో నుంచి గట్టెక్కిస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని నిర్వీర్యం చేసారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి మేడేటి శంకర్, జిల్లా కార్యదర్శి ఎం.ఎస్.చక్రవర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరావు, మండల శాఖ అధ్యక్షుడు ప్రగడ చక్రధరరావు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.4 కోట్లు పరిహారం చెల్లించాలి


అధికారులతో మాట్లాడుతున్న రైతులు, నాయకులు

నక్కపల్లి : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం జాతీయ రహదారి నుంచి చందనాడ వరకు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూములకు ఎకరాకు నాలుగు కోట్ల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని నిర్వాసిత రైతులు కోరుతున్నారు. శుక్రవారం ఆర్‌డీవో జయరాం, ఎస్‌డీసీ సత్యవాణి కాగిత, న్యాయంపూడిలకు చెందిన రైతులతో సమావేశమయ్యారు. కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలు తదితరులు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయంపూడి, కాగిత రెవెన్యూ పరిధిలో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న భూములను రోడ్డు నిర్మాణం కోసం సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఏపిఐఐసి వారు ఎకరాకు రూ.1.50 కోట్లు పరిహారం ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. మార్కెట్‌లో ఎకరం విలువ రూ.4 కోట్లు ఉందన్నారు. తక్కువ ధరకు భూములు ఇచ్చే ప్రసక్తి లేదని రెడ్డి వరహాలు తెలిపారు. వీసం రామకృష్ణ మాట్లాడుతూ ఎకరాకు రూ.1.80 కోట్లు పరిహారం చెల్లించేలా ఉంటే రైతులతో మాట్లాడి ఒప్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. దీనిపై ఆర్‌డీవో మాట్లాడుతూ అంతపరిహారం ఇచ్చే అవకాశం లేదన్నారు. రైతుల డిమాండ్‌ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ చర్చల్లో తహసీల్దార్ శ్రీకాంత్, డీటీ నీరజ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పీఏఎస్ అధ్యక్షుడు పాపారావు పాల్గొన్నారు.

కెమికల్ లారీ బోల్తా..ఒకరికి గాయాలు


ఒడ్డిమెట్ట వద్ద బోల్తా పడ్డ ఇథనాల్ ట్యాంకర్, గాయపడిన బొలేరో డ్రైవర్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి: జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో శుక్రవారం ఉదయం కెమికల్ లారీ బోల్తా పడింది. కాకినాడ ప్రాంతం నుంచి విశాఖ వైపు ఇథనాల్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ ముందు ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో బొలెరో వాహన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని 108 వాహనంలో తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. లారీ డ్రైవర్, క్లీనర్‌లు పరారయ్యారు. బోల్తాపడిన ట్యాంకర్‌కు రంధ్రం పడడంతో ఇథనాల్ బయటకు పోతోంది. జాతీయ రహదారి కావడంతో ఈ కెమికల్ వల్ల ఏదైనా ప్రమాదం ఏర్పడుతుందేమోనన్న భయంతో పోలీసులు, తుని అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని ట్యాంకర్‌ను పక్కకు తొలగించి నిలబెట్టే ప్రయత్నాలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. ఇథనాల్ బయటకు పోవడంతో సమీపంలోకి వెళ్లి సహాయ కార్యక్రమాలు చేసే వారికి, చుట్టుపక్కల ఉన్నవారికి కళ్ల మంటలు ఏర్పడ్డాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి విశాఖ జిల్లాలో ఉన్న ఫార్మా కంపెనీలకు ఈ ఇథనాల్‌ను తీసుకెళ్తున్నట్టు తెలిసింది.

యాభై వసంతాల నాటి చెలిమి..


74 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

చోడవరం రూరల్ : వారంతా వయసురీత్యా, ఉద్యోగరీత్యా రిటైర్‌మెంట్ అయినవారే. ఐదు దశాబ్దాల క్రితం తామంతా కలిసి మెలసి చదువుకున్న చెట్టు నీడలో తిరిగి కలుసుకున్నారు. ఇన్నేళ్ల తమ ఎడబాటులో ఎవరెవరు ఏఏ స్థానాలను అందుకున్నారు, వారి వారి వారసులు ఏం చేస్తున్నారు.. అన్న ముచ్చట్లతో మురిసిపోయారు. 1974లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న బాల్య మిత్రులైన ఈ వయోవృద్ధులు తామింకా ఆనాటి యువకులమే అన్నట్టుగా శుక్రవారాన్ని సంతోషవారంగా గడిపారు. సుమారు 50 వసంతాల క్రితం తాము చదువుకున్న పాఠశాలలో ఏదైనా మంచి పని చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర వీఆర్వో సంఘ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామ్మూర్తి చొరవతో డాక్టర్ నీలం నాగేంద్రబాబు, జి.విశ్వేశ్వరరావు, పూసర్ల సుధీర్‌ల కృషి ఫలితంగా 74 నాటి పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 35 మంది పూర్వ విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా కలుసుకున్నారు. వివిధ రంగాల్లో వివిధ స్థాయిల్లో సేవలు అందించిన, అందిస్తున్న వీరంతా తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా మంచి పని చేయాలని సంకల్పించారు. అదే విధంగా ఇకపై ఏటేటా ఇలా కలుసుకోవాలని ఆకాంక్షించారు.

ఉద్యోగమేళాలో 31 మంది ఎంపిక


ఉద్యోగమేళాకు హాజరైన నిరుద్యోగలతో ఎంపిక బృందం

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ ఎస్ఎస్‌డిసి నిర్వహించిన ఉద్యోగమేళాకు 35 మంది హాజరు కాగా వీరిలో 31 మందిని ఎంపిక చేశారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ మూడు టీంలు, ఏపీఎస్ఎస్‌డీసీ, కిమ్స్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాను ఉద్దేశించి ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిమ్స్ కళాశాల హెచ్ఆర్ రాధా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కిమ్స్ కళాశాలలో పనిచేయడానికి ఉద్యోగుల ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. కిమ్స్ హెచ్ఆర్ టీం సభ్యులు సాయిరాంవర్మ, భారతి మౌనిక, డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం


ఉత్సవమూర్తులతో కమిటీ సభ్యులు

రోలుగుంట: మండల కేంద్రం రోలుగుంటలో శుక్రవారం ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు జరిగాయి. బుధ, గురువారాలు చిన్న తీర్థాలు నిర్వహించగా, శుక్రవారం భారీ ఎత్తున పండగ జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన నేల డ్యాన్స్‌లు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

బంగారు, వెండి ఆభరణాల చోరీ

ఎస్.రాయవరం : కొరుప్రోలులోని ఓ ఇంట్లో చోరీ జరిగి 8 తులాలు బంగారం, 20 తులాలు వెండి అపహరణకు గురైనట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఈ నెల 6న పినపాత్రుని నాగలక్ష్మి ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లింది. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తలుపు తాళం తెరచి ఉంది. అనుమానం వచ్చిన నాగలక్ష్మి వెంటనే బీరువా చూడగా బీరువా తాళం తెరచి ఉందన్నారు. బీరువాలో ఉంచిన నక్లెస్, నల్లపూసలు, రెండు చైన్‌లు, చెవీలీలు సుమారు 8 తులాలు బంగారు వస్తువులు , 20 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ విభీషణరావు, నక్కపల్లి సర్కిల్ సీఐ అప్పన్న సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయొచ్చు


రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లి : ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయడం వల్ల గుండె, క్యాన్సర్, ఇతర వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుందని ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) డిపో మేనేజర్ ఎన్. సుజాత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.రామ్మూర్తి అన్నారు. ఆర్టీసీ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం జి.రామ్మూర్తి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేసిన వ్యక్తులకు రెండు మూడు రోజుల్లో శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయసు గల ఆరోగ్యవంతులైన వ్యక్తులు రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. సృష్టిలో రక్తం దొరకదని, రహదారి ప్రమాదాలు, రోగులకు ఆపరేషన్లు చేసే సమయంలో రక్తం ఉపయోగపడుతుందని తెలిపారు. శిబిరంలో 20 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. వారికి జి.రామ్మూర్తి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్ వై.రవిచంద్ర, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల టికెట్ ఎవరికిచ్చినా పనిచేయాలి

- కార్యకర్తలతో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

మాడుగుల/చోడవరం: మాడుగుల టికెట్ ఎవరికిచ్చినా అందరూ కలిసి పనిచేయాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. శుక్రవారం మాడుగుల మండలంలోని ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఆ పార్టీ నాయకుడు రాయిపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి అందించిన సేవల వల్లే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని, గడచిన ఎన్నికల్లో టీడీపీతో పొత్తు లేకపోవడం వల్లే జనసేన పార్టీ ఓటమి చవిచూసిందని చెప్పారు. సమావేశానికి జనసేన కార్యకర్తలు అరకొరగా హాజరయ్యారు. చోడవరంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో చోడవరంలో జరిగిన సమావేశంలో నాగబాబు పాల్గొన్నారు. సీట్ల సర్దుబాటు, జనసేన ఎన్ని సీట్లతో పోటీ చేస్తుందనే అంశాలు వారం రోజుల్లో తేలుతాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, యలమంచిలి ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కరాటే పోటీల ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: నిజిషోటోకాన్ కరాటే పేరిట నిర్వహిస్తున్న ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం పోర్ట్ స్టేడియంలో సినీనటుడు సుమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మూడు రోజుల పాటు కాటా, కుమిటీ అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి.

అర్హతుంటే చాలు.. అందలమెక్కిస్తాడు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి మేలు చేశారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆసరా, చేయూత, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వాహనమిత్ర.. ఇలా ఒకటేమిటి అనేక పథకాలు ప్రజలకు చేరువ చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. తాజాగా పేదల సొంతింటి కల నిజం చేసి ఆయనను మించిన పాలకుడు లేడని ప్రజలు కొనియాడే స్థాయిలో సంక్షేమం చేరువ చేశారు.

- సీఎం జగన్ పాలనకు పేదలు ఫిదా
- దశాబ్దాల సొంతింటి కల నెరవేరిందని ఖుషీ



అనకాపల్లి : జీవీఎంసీ జోన్ పరిధిలో నివసించే బడుగు, బలహీన వర్గాల సొంతింటి కల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెరవేరిందని పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి పాలనలో బలహీన వర్గాల ప్రజలకు మంచి చేయడంతో ఆయన ప్రజల మనసుల్లో నేటికీ చెరగని ముద్ర వేసుకున్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5,425 మంది లబ్ధిదారులకు సొంతిళ్లు..

జోన్ పరిధిలో నివసించే 5,425 మంది నిరుపేదలకు సెంట్ ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వడంతో లబ్ధిదారుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో మండల పరిధిలోని గొలగాం 1, 2, 3 సర్వే నంబర్లు, కోడూరు పరిధిలో 1,5 సర్వే నంబర్లు, సత్యనారాయణపురం కొండ వద్ద, పాపయ్యసంతపాలెం, మామిడిపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ స్థలంలో గృహాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికి 60 శాతం పనులు పూర్తి కావస్తున్నారు. మరో రెండు మూడు మాసాల్లో గృహప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధమవుతున్నారు. 5,425 మంది లబ్ధిదారులకు ప్రభుత్వమే పట్టదారు పాస్ పుస్తకాలు ఇచ్చి, రిజిస్ట్రేషన్ పనులు చేసింది.

సత్యనారాయణపురంలో టిడ్కో గృహాలు..

మండలంలో సత్యనారాయణపురం టిడ్కో గృహాలను మూడు విభాగాలుగా ప్రభుత్వం విభజించి నిర్మాణ పనులు పూర్తి చేసింది. లబ్ధిదారులు గృహాల్లో నివసించే సమయంలో ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వ పరంగా అన్ని రకాలైన మౌలిక సదుపాయాలు కల్పించింది. సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేపట్టి పత్రాలు అందజేసింది.



7వ సచివాలయంలో లబ్ధిదారులకు టిడ్కో గృహాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఉద్యోగి



7వ సచివాలయం పరిధిలో టిడ్కో ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులు

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల కేటాయింపు ఇలా..

- 300 ఎస్ఎఫ్‌టీకి 2296 మందికి దరఖాస్తు చేసుకోగా 2,263 మందికి రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేయగా 33 మంది మృత్యువాత పడ్డారు. ఈ గృహాల లబ్ధిదారులు బ్యాంకుకు ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేదు.
- 365 ఎస్ఎఫ్‌టీకి 96 మంది దరఖాస్తు చేసుకోగా 79 మందికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వగా, మిగిలిన 17 మంది అనివార్య కారణాల వల్ల విరమించుకున్నారు. ఒక్కొక్క గృహానికి లబ్ధిదారు బ్యాంకు వాటాగా రూ.3.15 లక్షల నగదు చెల్లించగా, లబ్ధిదారుకు ప్రభుత్వం రూ.25 వేలు అందజేస్తుంది.
- 430 ఎస్ఎఫ్‌టీకి 352 మంది దరఖాస్తు చేసుకోగా 305 మందికి రిజిస్ట్రేషన్ చేయగా 47 మంది వివిధ సమస్యలు వ్యక్తం చేశారు. ఒక్కొక్క గృహానికి లబ్ధిదారు బ్యాంకు వాటాగా రూ.3.65 లక్షల నగదు చెల్లించగా, ప్రభుత్వం లబ్ధిదారునికి రూ. 50 వేలు అందజేస్తుంది.

పదేళ్లకు సొంతింటి కలనెరవేరింది..



రెక్కాడితే గాని డొక్కాడని జీవితం మాది. కుటుంబ సమేతంగా కష్టపడుతున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో గృహాలు ఇస్తారని వెయ్యి కళ్లతో ఎదురుచూసాం. ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలతో పాటు సత్యనారాయణపురం టిడ్కో ఇల్లు పొందాం. 300 ఎస్ఎఫ్‌టీ ఇంటిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. మాకు ఇంత కంటే ఏం కావాలి.

– ఎ.రమణమ్మ, నాగవంశంవీధి, అనకాపల్లి

330 ఎస్ఎఫ్‌టీ ఇల్లు ఇచ్చారు..



పెద్దవీధి రామాలయం వద్ద అద్దె భవనంలో టిఫిన్ దుకాణం నిర్వహిస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అక్కడే చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో పాటు జీవిస్తున్నాను. 40 సంవత్సరాలుగా అద్దె ఇల్లే గతి అయింది. జగనన్న సీఎం అయ్యాకే మా సొంతింటి కల నేరవేరింది. ఇల్లు చూపించి, తాళాలు కూడా ఇచ్చారు. పేదల కోసం తపన పడుతున్న ముఖ్యమంత్రి జగన్ బాబుకు కృతజ్ఞతలు.

– సీహెచ్ అప్పలరత్నం, పెద్దవీధి, అనకాపల్లి

జగన్ బాబు న్యాయమే చేస్తాడు..



గత ప్రభుత్వ హయాంలో చిన్న పనికి కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ఇంటికొచ్చి ఏ పనైనా చేసి పెడుతున్నారు. నాకు 365 ఎస్ఎఫ్‌టీ ఇల్లొచ్చింది. రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. గృహానికి బ్యాంకు రూ.3.15 లక్షల లోన్ ఇచ్చింది. అర్హత ఉంటే చాలు జగన్ బాబు ఊరకే వదిలేయడు. గొప్పగా పాలిస్తున్నాడు.

– ఎ.కనకదుర్గ, కోట్నివీధి, అనకాపల్లి

క్లుప్తంగా

వైద్య సేవలపై ఆరా



రోగికి ఆక్సిజన్ ఎక్కిస్తున్న తీరును పరిశీలిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని శుక్రవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి సందర్శించారు. ఆర్ఎంవో శ్రీనివాస్‌ను రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగితో మాట్లాడుతూ ఏయే సమయాల్లో వార్డును వైద్యులు పరిశీలిస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. అత్యవసర విభాగంతో పాటు ఆరోగ్యశ్రీ, ప్రసూతి, క్యాజువాల్టీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మరో డైరెక్టర్ మునూరు శ్రీను, వైద్యాధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాసుని హుండీ ఆదాయం రూ. 2.18 లక్షలు

అనకాపల్లి : శ్రీనివాసుని హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ సకల రాజ్యలక్ష్మి అధ్యక్షతన అధికారులు, సిబ్బంది లెక్కించారు. 43 రోజులకు గాను రూ.2,18,755 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో టి.రాజసులోచన చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్నసన్యాసిరావు, ముమ్మిన పైడిరాజు, శ్రీధరాల కోమలి రామ్మోహన్, రాజాన లక్ష్మీశ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై నిఘా

తుమ్మపాల : బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి కె.అనంతలక్ష్మి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నివారణకు చేపట్టవలసిన అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ పీవోలు, కమిటీ సభ్యులు నిఘా పెట్టి పోలీసు వారి సహకారంతో వివాహాలు జరగకుండా చూడాలన్నారు. 'బేటీ బచావో బేటీ పడావో' నినాదం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. బాలల రక్షణ, సహాయ సహకారాలకు ఫోన్ 9966141479 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి పి.లక్ష్మి తెలిపారు. దిశ డీఎస్ పీడీ రాములమ్మ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, బాలల సంక్షేమ జిల్లా ప్రొబేషన్ అధికారి శరత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.రాణి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 6,742 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,750	4,760
మొదటి రకం	3,480	4,100
రెండో రకం	3,450	3,650
మూడోరకం	3,260	3,510

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్తిసాయి
గేమ్ ఆన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఓ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 406 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



అనకాపల్లి బాలికోన్నత పాఠశాలలో డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న ఏఎన్ఎం



కశింకోట బాలికల హైస్కూలులో నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి



'డీవార్మింగ్ డే' ఆంగ్ల అక్షర రూపంలో డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థుల ప్రదర్శన

అనకాపల్లి : పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నులిపురుగుల నివారణలో భాగంగా విద్యార్థులకు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు డీ వార్మింగ్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో..

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 1,489 మంది విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. స్థానిక బాలికల హైస్కూల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద నులి పురుగుల నివారణ మాత్రలు అందజేశారు. హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, విద్యా కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాధికారి తిరుపతిరావు మాత్రలు పంపిణీ చేసి మింగించారు. 47 మంది గర్భిణులకు కూడా వీటిని సరఫరా చేశారు. 92.69 శాతం మందికి పీహెచ్‌సీ పరిధిలో నులిపురుగు నివారణ మాత్రలు అందజేశామని, మిగిలిన వారికి ఈ నెల 16న అందజేయడానికి చర్యలు చేపట్టామని వైద్యాధికారి తిరుపతిరావు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, పరమానందరావు, సూపర్‌వైజర్లు రామ్మూర్తి, సుభాని, విజయలక్ష్మి, గుప్తా, హనుమంతు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల విన్యాసం..

కశింకోట : కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులు విన్యాసాలు చేశారు. ×డివార్మింగ్ డే÷ఆంగ్ల అక్షర రూపంలో విద్యార్థులు కూర్చుని విన్యాసం చేసి ఉత్సవ ప్రాధాన్యతను తెలియజేశారు. హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, ఉపాధ్యాయులు ఆచంట రవి, బి. అప్పారావు, పీఎం నాయుడు, వి. ప్రభాకరరావు, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

అనకాపల్లి : జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్ ఆవరణలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం ఆదిరెడ్డి సూర్యనారాయణ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో గాయకునిగా పద్మశ్రీ బిరుదు పొందిన ప్రముఖ గాయకుడున్నారు. ఘంటసాల విగ్రహాన్ని అనకాపల్లి పట్టణంలో ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు హైస్కూల్ విద్యార్థులకు ఘంటసాల పాటలపై పోటీలు నిర్వహించి, గెలిపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యదర్శి వినకోట నీలేష్‌గుప్త, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి రక్ష.. జగనన్న సురక్ష



విద్యార్థిని పరీక్షిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ సంధ్య

కశింకోట : మండలంలోని జెట్టపురెడ్డితుని సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 498 మందికి ఉచిత వైద్య సేవలందించారు. వీరిలో 98 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్లద్దాల కోసం సిఫార్స్ చేశారు. శిబిరానికి ఎముకల ప్రత్యేక నిపుణుడు ఎస్. గోపి, ఈఎన్‌టీ నిపుణురాలు చరిత, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి పది రకాల రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ సంధ్య కంటి రోగులను పరీక్షించారు. శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ కోన అరుణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, పార్టీ నాయకుడు కె.వి.వి. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మేరీ జోన్స్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



మారేడుపూడి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి : దశల వారీగా గ్రామాల్లో రహదారులను మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలో మారేడుపూడి పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారిని కలిపే రోడ్డును రూ. 7లక్షలతో నిర్మించేందుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో ప్రధాన రహదారులు ఇప్పటికే అభివృద్ధి చేశామన్నారు. ఎక్కడైనా రహదారులు శిథిలమైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ సర్పంచ్ సాలాపు కనకరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఈగల రామునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగల నూకరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి, శీరంశెట్టి నర్సింగరావు, కొమ్మోజు కృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలి

తుమ్మపాల : బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 16న తలపెట్టిన పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి. కోటేశ్వరరావు కోరారు. పార్టీ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశం వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని, రైతులకు నష్టం కలిగించే మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ భద్రం, రైతుకూలీ సంఘం జిల్లా కన్వీనర్ కోన మోహన్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు రాంబాబు, ఏపీ రైతు సంఘం నాయకులు శంకరరావు, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ బాలు గాడి, నగిరెడ్డి సత్యనారాయణ, బుద్ధ రంగారావు, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ పైడపునాయుడు

తుమ్మపాల : రోడ్డు భద్రత నియమాలపై అందరు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు అన్నారు. మండలంలోని శంకరంలో గల ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ ఆవరణలో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సచివాలయాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డీఆర్డీఏ పీడీ శచీదేవి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రావు, ఎం.మురళీకృష్ణ, కె.శిరీష, ట్రాఫిక్ ఎస్సై నరసింగరావు పాల్గొన్నారు

రహదారి పునర్నిర్మాణానికి వినతి

అనకాపల్లి : అనకాపల్లి – అచ్యుతాపురం రహదారిని పునర్నిర్మించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖ ఈఈ ఆంజనేయ రాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అచ్యుతాపురంలో పరిశ్రమల రాకతో భారీ వాహనాల రాకపోకలతో రహదారి చిన్నాభిన్నమైందని, భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని, తక్షణమే రహదారి నిర్మాణానికి కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కమిటీ సభ్యులు గంటా శ్రీరాం, వీవీ శ్రీనివాసరావు, కాంగ్రేగుల రామ సదాశివరావు, కర్రి అప్పారావు, ఆళ్ల మహేశ్వర రావు, బుద్ధ రంగారావు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి అమావాస్య పూజ

అనకాపల్లి : గవరపాలెం నూకాంబిక అమ్మవారికి శుక్రవారం అమావాస్య పూజ సాంప్రయబద్ధంగా జరిగింది. ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో కాంద్రేగుల శ్యామల ఆర్థిక సహాయంతో అమ్మవారికి పరమాన్నం, బూరెలు, అరిసెలు, చక్రపొంగలి, పెరుగువడ నివేదించారు. 1000 మందికి అన్నసమారాధన చేపట్టారు. ఆలయ ఆవరణలో చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో కొబ్బరిచెక్కలు, గాజులు, భక్తులు సమర్పించిన పప్పులకు టెండర్‌కం వేలంపాట జరిగింది. కొబ్బరిచెక్కల సేకరణ రూ.9 లక్షల 50 వేలకు, పప్పులు, గాజులు తీసుకునే హక్కును రూ. లక్షా 30 వేలకు పెంటకోట ఈశ్వరరావు దక్కించుకున్నారు. అంతకు ముందు ఆలయ సిబ్బందికి రెండు జతల యూనిఫాం మురళీకృష్ణ, ప్రసాద్ అందజేశారు.

'కాంట్రాక్ట్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి'

తుమ్మపాల : ఎన్టీఆర్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎస్.భద్రం డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న కార్మికులకు బకాయిలు పెట్టడం, అరకొర జీతాలు చెల్లించడం దుర్మార్గమన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



పూడిమడక జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరావు

అనకాపల్లి : జాతీయ, పట్టణ రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రధాన కూడళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. స్థానిక సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆర్థిక సాయంతో (రూ.లక్ష) ప్రమాదాల నివారణకు వివిధ ప్రాంతాల్లో 40 హెచ్చరిక బోర్డులను శుక్రవారం ఏర్పాటు చేశామన్నారు. అనకాపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు అన్నారు. సీఎంఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ హెచ్చరిక బోర్డులను జాతీయ రహదారిలోని కొత్తూరు, పూడిమడక, తోటాడ నూకాంబిక ఆర్చ్, సుంకరమెట్ట జంక్షన్ల వద్ద, పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాహన చోదకులు, ప్రజలు రహదారి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవం నేడు



డీపీఎన్ జెడ్‌పీ హైస్కూలు వద్ద వెలసిన గౌరీపరమేశ్వరులు

కశింకోట : గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఏటా ఫిబ్రవరి రెండో శనివారం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గౌరమ్మ విగ్రహాన్ని రథంపై గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించి శారదా నదిలో నిమజ్జనం చేయనున్నారు. ఉత్సవం సందర్భంగా రాత్రి డ్యాన్స్ షో, డాన్స్ మస్తీ, గోవిందుడు అందరివాడేలే డాన్స్ హంగామా, బాలు రైడర్స్ డ్యాన్స్ బేబీ డాన్స్, డాన్స్ ధమాకా, గరివిడి లక్ష్మి తదితర బుర్ర కథలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. నెమలి డ్యాన్స్, పలు నేల వేషాలు, బాణసంచా కాల్చనున్నట్లు తెలిపారు.

మరిడిమాంబ అమ్మవారి సారె ఊరేగింపు

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి సారె ఊరేగింపు శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. ఆలయ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల మహిళా భక్తులు బూరెలు, జంతికలు, సున్నుపాకుండలు, గవ్వలు, అరిసెలు, లడ్డూలు, కాజాల వంటి తినుబండారాలతో పాటు అరటి పళ్లు, పసుపు, కుంకుమలతో పుర వీధుల గుండాఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నివేదించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల శివరామ సత్యనారాయణ, పలకా రాము, బొబ్బిలి అప్పారావు, పిట్ట బుద్దేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఎడ్ల బళ్ల పోటీలు



అమీన్‌సాహెబ్‌పేటలో ఎడ్ల పరుగు పోటీ నిర్వహణ

కశింకోట : ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలో విజయనగరానికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎడ్ల బండి ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానికులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. పోటీలో చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన మూడు బళ్లకు బహుమతులు లభించాయి. చుక్కపల్లికి చెందిన మైసాల శోమనాథ్ ద్వితీయ, మురుగుర్తి హరికృష్ణ బండికి తృతీయ స్థానం లభించాయి. చోడవరం మండలం లక్కవానిపాలెం బండికి నాలుగవ స్థానం, అద్దెపల్లి పాలవెల్లి బండి (చుక్కపల్లి)కి ఐదవ స్థానం లభించాయి. వీరికి వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు వంతున వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ బహుమతులు అందజేశారు. పోటీల అనంతరం తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని ప్రజలు దర్శించుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మలసాల కుమార్‌రాజా తదితరులు స్వామికి పూజలు నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు తీర్థ మహోత్సవంలో పాల్గొన్నారు.